# జాతుల సమస్య

**స్టాలిన్**

*1924లో కామ్రేడ్ స్టాలిన్ స్వెర్డ్లోవ్ విశ్వ విద్యాలయంలో "లెనినిజం పునాదులు" అనే శీర్షిక క్రింద యిచ్చిన ఉపన్యాసాల్లో యిది ఆరవది. ఈ ఉపన్యాసాలను గ్రంథ రూపంలో తిరిగి ప్రచురించ డానికి సోవియట్ సిద్ధాంతవేత్తల సమావేశంలో డిసెంబరు (1961) చివరి వారంలో నిర్ణయించారు. కంభంపాటి సత్యనారాయణ,కడియాల గోపాలరావు, మహీధర రామమోహనరావుల సంపాదకత్వంలో వెలువడిన 'సందేశం' (మార్క్సిస్టు సిద్ధాంత-రాజకీయ మాస పత్రిక) 1962 ఫిబ్రవరి సంచికనుండి పునర్ముద్రిస్తున్నాం.*

**- సంపాదకుడు**

ప్రస్తుతం నేను రెండు ప్రధాన సమస్యలను తీసుకుంటాను. 1. జాతుల సమస్య అంటే ఏమిటి? 2. పీడిత జాతుల స్వాతంత్ర్యోద్యమమూ, శ్రామిక విప్లవం.

## జాతుల సమస్య అంటే ఏమిటి?

గత 20 సంవత్సరాల్లోను జాతుల సమస్య అనేక ముఖ్య విషయాల్లో మార్పు చెందుతూ వచ్చింది. రెండవ ఇంటర్నేషనల్ నాటి జాతుల సమస్య వేరు. ఈ సమస్య క్రిందికి ఏవేవి వస్తాయనే విషయంలోనే గాక, దాని అసలు స్వభావంలోనే ఎంతో వ్యత్యాసం ఉంది. అప్పటికీ, యిప్పటికీ, పూర్వం జాతుల సమస్య "సంస్కృతి గల" జాతులకు సంబంధించిన కొన్ని విషయాలకు మాత్రమే సంబంధించి వుండేది. ఐరిష్‌ప్రజలు, హంగేరియన్లు, పోలీష్ ప్రజలు, ఫిన్నిష్ ప్రజలు, సెర్బియన్లు, తదితర యూరోపియన్ జాతుల ప్రజలు మాత్రమే పీడిత జాతుల క్రిందకు వచ్చేవారు. వీరి భవిష్యత్తును గురించి రెండవ ఇంటర్నేషనల్ నాయకులు శ్రద్ధ వహించేవారు. అమానుషంగా, అతిక్రూరంగా పీడింపబడే కోటానుకోట్ల ఆసియా ప్రజలను గురించి వారు సాధారణంగా పట్టించుకునేవారు కారు. తెల్లజాతుల వారినీ, నల్లజాతులవారినీ, "నాగరిక" జాతుల్నీ, "అనాగరిక" జాతుల్నీ ఒకే దృష్టితో చూడ్డానికి వారు సంకోచించేవారు. వారిని గురించి రెండో మూడో అర్థం లేని మెత్తమెత్తని తీర్మానాలు చేసి గర్వంతో విర్రవీగేవారు. వలస దేశాల ప్రజల్ని విముక్తి చేసే విషయం మాత్రం ఆ తీర్మానాల్లో ఎక్కడా వుండేది కాదు. అతి జాగ్రత్తతో వారు దాన్ని దూరంగా నెట్టేవారు. జాతుల సమస్యను పరిష్కరించడంలో వారు ప్రదర్శిస్తూ వచ్చిన యీ మోసం, యీ మెత్తదనం నేడు అంతరించిందని చెప్పవచ్చు. లెనినిజం వారిలోని పరస్పర వైరుధ్యాలను బయటపెట్టింది. తెల్లజాతుల వారికీ, నల్లజాతుల వారికీ మధ్య, యూరోపియన్ జాతులకూ-ఆసియా జాతులకూ మధ్య, సామ్రాజ్యవాదం క్రింద నలిగిపోయే "అనాగరిక" జాతులకూ - "నాగరిక" జాతులకూ మధ్య సృష్టించబడిన గోడను లెనినిజం పడగొట్టింది. ఈ విధంగా జాతుల సమస్యకూ, వలస దేశాల సమస్యకూ మధ్య సమన్వయ మేర్పరచింది. అంటే జాతుల సమస్య ఒక ప్రత్యేకమైన సమస్యగా, ఏదో ఒక ప్రభుత్వానికి సంబంధించిన ఆంతరంగిక సమస్యగా ఉండే స్థితి నుంచి మొత్తం ప్రపంచానికంతకూ సంబంధించిన అంతర్జాతీయ సమస్యగా మార్పు చెందింది. పరాధీన దేశాల్లోనూ, వలస దేశాల్లోనూ నివసించే పీడిత ప్రజలందరినీ సామ్రాజ్యవాద శృంఖాలాల నుంచి విముక్తి చేసే సమస్యగా పరిణమించింది.

పూర్వం అన్ని జాతులకూ స్వయం నిర్ణయాధికారము ఉండాలనే సూత్రానికి వక్ర భాష్యాలు చెప్పడం సర్వసాధారణంగా జరుగుతూ ఉండేది. తరచు స్వయం నిర్ణయాధికారమంటే, రాష్ట్రీయ స్వపరిపాలన అని అతి సంకుచితమైన అర్థం చెప్పేవారు. రెండవ ఇంటర్నేషనల్‌కి చెందిన కొందరు నాయకులు మరో అడుగు ముందుకు వేసి, స్వయం నిర్ణయాధికారమంటే, సంస్కృతికి సంబంధించిన విషయాలలో మాత్రమే స్వాతంత్ర్య మని అర్థం చెప్పేవారు. అంటే, పీడిత జాతులు సాంస్కృతిక రంగంలో మాత్రమే తమ సొంత సంస్థలను పెట్టుకోవచ్చుననీ, రాజ్యాంగాధికారం మాత్రం పాలకజాతి చేతులలోనే ఉండాలనీ, వారు చెప్పేవారు. ఇట్టి వక్రభాష్యాల వల్ల స్వయం నిర్ణయ సూత్రం సామ్రాజ్యవాదుల దురాక్రమణను ప్రతిఘటించడానికొక సాధనముగా ఉపయోగపడే స్థితి నుంచి, ఆ దురాక్రమణను సమర్థించే ప్రమాద స్థితికి దిగజారిపోయింది. కాని ఇప్పుడు ఈ గందర గోళమంతా అంతరించిందని చెప్పవచ్చు. లెనినిజం స్వయం నిర్ణయ సూత్రం యొక్క అర్థాన్ని విస్తృత పరచింది. స్వయం నిర్ణయాధికారమంటే వలస దేశాల్లో జీవించే పీడిత ప్రజలకు విడిపోయే హక్కుతో సహా స్వాతంత్ర్యమనుభవించే హక్కు అని, తమ సొంత ప్రభుత్వాలను నెలకొల్పుకొనే హక్కు కూడా వారికి గలదనే లెనినిజం స్పష్టపరచింది. పూర్వం మాదిరిగా, స్వయం నిర్ణయాధికారమంటే, రాష్ట్రీయ స్వపరిపాలన అని అర్థం చెప్పడం కానీ తద్వారా దురాక్రమణను సమర్థించడంగానీ యిప్పుడు సాధ్యం కాదు. ఈ విధంగా స్వయం నిర్ణయ సూత్రం సామ్రాజ్యవాద యుద్ధం జరుగుతున్న రోజుల్లో బూటకపు సోషలిస్టు చేతుల్లో ప్రజల్ని మోసం చేయడానికొక సాధనంగా ఉపయోగపడే స్థితిపోయి, అన్ని రకాలైన సామ్రాజ్యవాద దుర్వాంఛలను, బూటకపు సోషలిస్టు కుట్రలను బయటపెట్టడానికి ఉపయోగపడే సాధనంగా మార్పు చెందింది. ప్రజా సామాన్యానికి అంతర్జాతీయ దృక్పథం అలవరచే సాధనంగా మారిపోయింది.

పూర్వం పీడిత జాతుల సమస్య కేవలం న్యాయశాస్త్ర సమస్యగా పరిగణింపబడేది. రెండవ ఇంటర్నేషనల్‌కి చెందిన పార్టీలు " సమస్త జాతులూ సమాన"మంటూ పవిత్రమైన ప్రకటననూ, అసంఖ్యాకమైన తీర్మానాలనూ చేసేవారు. సామ్రాజ్యవాదం క్రింద "సమస్త జాతులు సమానం"గా ఉండటం హాస్యాస్పదమైన విషయం అని వారు గుర్తించే వారు కారు. సామ్రాజ్యవాద మంటేనే, కొన్ని జాతుల సముదాయం (అల్ప సంఖ్యాకులైన వారు) మరికొన్ని జాతుల సముదాయాన్ని కొల్లగొట్టుకుపోవడమన్న మాట. ఈ బూర్జువా న్యాయశాస్త్ర దృక్పథం నేడు ప్రపంచానికి బాగా బట్టబయలయిందని మనం రూఢిగా ప్రకటించవచ్చు. లెనినిజం

యీ సమస్యను పవిత్ర తీర్మానాలనే పర్వత శిఖరాల నుంచి భూమి మీదకి తీసుకొచ్చింది. శ్రామిక పార్టీలు, పీడిత జాతులు స్వాతంత్ర్య పోరాటాలకు ప్రత్యక్ష సహాయం చేయకపోతే "సమస్త జాతులూ సమానమనే" ప్రకటనలు అర్థంలేని బూటకపు కబుర్లని లెనినిజం స్పష్టపరచింది. ఈ విధంగా, పీడిత జాతులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, నిజమైన సమానత్వం కోసం తమ సొంత పరిపాలనాధికారం కొరకు జరిపే స్వాతంత్ర్య పోరాటాలకు నిజమైన సహాయం, ఎడతెగని సహాయం చేయడమెలాగు – అనే సమస్యయే పీడిత జాతుల సమస్యగా మారింది.

పూర్వం, జాతుల సమస్య ఒక ప్రత్యేక సమస్యగా భావింపబడేది. దానికీ, పెట్టుబడిదారుల పెత్తనం మూలంగా ఉద్భవించే యితర సమస్యలకూ, ఎట్టి సంబంధం లేదని భావింపబడేది. సామ్రాజ్యవాద నిర్మూలనకు సంబంధించిన సమస్యలతోగాని, శ్రామిక విప్లవానికి సంబంధించిన సమస్యలతోగాని, దానికెట్టి సంబంధం లేనట్లు చిత్రింపబడేది. వలస దేశాల స్వాతంత్ర్యోద్యమాలకు ప్రత్యక్ష సహాయం చేయకుండానే, యూరోపియన్ శ్రామికవర్గం అధికారంలోకి రాగలదని యీ సంస్కరణవాదుల ఊహ. ఇక వలస దేశాల సమస్య, పీడిత జాతుల సమస్య దానంతట అది "సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా విప్లవ పంథాలో పోరాడ నవసరం లేకుండానే, శ్రామిక విప్లవమను రాచబాటకు దూరంగానే" పరిష్కరింపబడగలదని వారి అభిప్రాయం. ఈ విప్లవ వ్యతిరేక దృక్పథం పూర్తిగా బట్టబయలయిందని మనమిప్పుడు చెప్పవచ్చు. జాతుల సమస్య శ్రామిక విప్లవం మూలంగానే, ఆ పునాది మీదనే పరిష్కరింప బడుతుందని లెనినిజం రుజువు చేసింది. వలస దేశాల, పరాధీన దేశాల ప్రజలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిపే స్వాతంత్ర్యోద్యమాలకు పశ్చిమ దేశాల శ్రామికవర్గం విప్లవయుతమైన సహకారం యివ్వడం ద్వారానే అధికారంలోకి రాగల్గుతుందని లెనినిజం రుజువు చేసింది. ఇందుకు రష్యన్ విప్లవమే తార్కాణం. కాబట్టి జాతుల సమస్య, శ్రామిక విప్లవమనే అసలు సమస్యలో శ్రామిక నియంతృత్వ సమస్యలో ఒక భాగమని మనం గుర్తించాలి.

అందుచేత, జాతుల సమస్య అంటే యిది : పీడిత దేశాల స్వాతంత్ర్యోద్యమాల్లో అంతర్గమైవున్న విప్లవ అవకాశాలు ఇది వరకే అంతరించి పోయాయా? లేక ఇంకా వున్నాయా? ఉన్నట్లయితే వాటిని శ్రామిక విప్లవం కొరకు వినియోగించు కోవచ్చునని ఆశించవచ్చునా? పరాధీన దేశాలూ, వలస దేశాలూ సామ్రాజ్యవాదులైన పెట్టుబడిదార్లకు రిజర్వులుగా ఉండే స్థితి నుంచి విప్లవవర్గమైన శ్రామికులకు రిజర్వులుగా ఉండే స్థితికి, వారితో స్నేహంగా ఉండే స్థితికి తీసుకురాగలమా?

తప్పకుండా తీసుకురాగలమని లెనినిజం చెబుతుంది. పీడిత దేశాల స్వాతంత్ర్యోద్యమాలలో విప్లవ అవకాశాలెన్నో ఉన్నాయని లెనినిజం గుర్తిస్తుంది. ఉమ్మడి శత్రువులైన సామ్రాజ్యవాదాన్ని కూలద్రోసేటందుకు యీ అవకాశాలను ఉపయోగించుకోవచ్చునని అది చెబుతుంది. ఈ విషయంలో లెనినిజం చెప్పేదే సరియైనదని సామ్రాజ్యవాదపు అభివృద్ధి, సామ్రాజ్యవాద యుద్ధం, రష్యన్ విప్లవం – రుజువు చేశాయి.

అందుచేత, శ్రామికవర్గం పీడితజాతుల, పరాధీన దేశాల స్వాతంత్రోద్యమాలను ప్రత్యక్షంగా దృఢనిశ్చయంతో బలపరచవలసియుంది.

అయితే దీని అర్థం ప్రతి జాతీయోద్యమాన్ని ప్రతీ దేశంలోను, ప్రతీసారి ప్రతి సందర్భంలోనూ బలపరచాలని కాదు. సామ్రాజ్యవాదాన్ని బలహీన పరిచే, దాన్ని కూలద్రోసే జాతీయోద్యమాలకు మాత్రమే సహాయం చేయాలి; అంతేగాని సామ్రాజ్యవాదాన్ని బలపరిచే, దాన్ని కాపాడే జాతీయోద్యమాలకు సహాయం చేయకూడదు. ఒక్కొక్కప్పుడు కొన్ని పీడిత దేశాల్లో జాతీయోద్యమం, శ్రామికోద్యమ పురోభివృద్ధికి వ్యతిరేకంగా పరిణమించవచ్చు. అట్టి సందర్భాలలో దానికి సహాయం చేయడం అసంభవం. వివిధ జాతులకు సంబంధించిన హక్కుల సమస్యకూ, యితర సమస్యలకూ సంబంధం చాలా ఉంది. శ్రామిక విప్లవమనే అసలు సమస్యలో అదొక భాగం. అందుచేత అసలు సమస్య కంటే దాని ప్రాధాన్యత తక్కువ. అసలు సమస్యను దృష్టిలో ఉంచుకొంటూ దాన్ని మనం పరిశీలించాలి. 1840–50 సంవత్సరాలమధ్య మార్క్స్ పోలిష్ జాతీయోద్యమాన్ని, హంగేరియన్ జాతీయోద్యమాన్ని బలపరిచాడు. కాని జక్కుల జాతీయోద్యమాన్ని, దక్షిణ స్లావ్‌ల జాతీయోద్యమాన్ని వ్యతిరేకించాడు. ఎందువల్ల? ఆ రోజుల్లో జక్కులు, దక్షిణ స్లావ్‌లు "అభివృద్ధి నిరోధక జాతులు". యూరపు ఖండంలో రష్యా తరపున కాపాలా కాచే సేనలు", నిరంకుశ ప్రభుత్వాల తరపున పనిచేసే రక్షక దళాలు, కాని పోలిష్ జాతి, హంగేరియన్ జాతి, 'విప్లవజాతులు'. నిరంకుశ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న జాతులు. ఆనాటి జాతులలో జక్కుల ఉద్యమానికి ఆ స్లావ్‌ల ఉద్యమానికి, సహాయం చేయడమంటే, యూరపు ఖండం అంతటిలోనూ విప్లవోద్యమానికి బద్ధ శత్రువైన జారిస్టు ప్రభుత్వానికి ప్రత్యక్ష సహాయం చేయడమన్న మాట.

లెనిన్ ఈ సందర్భంలో ఇలా రాశాడు : "ప్రజాతంత్ర హక్కులన్నీ స్వయం నిర్ణయ హక్కుతో సహా, దేశవ్యాపితమైన ప్రజాతంత్ర ఉద్యమంలో (ప్రస్తుత సమయంలో మొత్తం సోషలిస్టు ఉద్యమంలో) ఒక చిన్నభాగం మాత్రమే. అంతేకాని వాటికవి, ప్రపంచ ఉద్యమానికి వేరుగా ఉండవు. కొన్ని సందర్భాలలో యీ చిన్నభాగం మొత్తం ఉద్యమంతో భేదించవచ్చు. అటువంటప్పుడు దాన్ని మనం వ్యతిరేకించవలసి యుంటుంది."(లెనిన్ : మార్క్స్, ఏంగెల్సు, మార్క్సిజం పేజీ 199)

అందుచేత మనం, వివిధ జాతీయోద్యమాల విషయాలోచించేటప్పుడు, వాటిని ముక్కుకు సూటిగా చూడకూడదు. వాస్తవ పరిస్థితులను గమనిస్తూ, విప్లవోద్యమం యొక్క ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, పరిశీలించవలసి ఉంటుంది. ఇలా పరిశీలించేటప్పుడు, కొన్ని జాతీయోద్యమాల యెడద, కొన్ని అభివృద్ధి నిరోధక ఉద్యమాలయెడ ఎట్టి వైఖరినవలంబించాలో తెలుసుకోవడానికి పై వివరణ తోడ్పడుతుంది.

ఈ దృక్పథంతోనే మొత్తం మీద జాతీయో ద్యమాల విప్లవ స్వభావాన్ని కూడా అంచనా వేయవలసి యుంటుంది. కొన్ని

జాతీయోద్యమాలు ఆయా ప్రత్యేక పరిస్థితుల్లో అభివృద్ధి నిరోధక స్వభావాన్ని కలిగియున్నట్లే, జాతీయోద్యమాలలో అత్యధిక భాగం ఆయా ప్రత్యేక పరిస్థితుల్లో విప్లవ స్వభావాన్ని కలిగియుంటాయి. ఒకానొక జాతీయోద్యమం విప్లవకరమైనదని మనమన్నప్పుడు ఆ ఉద్యమంలో శ్రామికశక్తులున్నాయనిగాని, విప్లవకరమైన రిపబ్లికన్ కార్యక్రమం దానికున్నదని గాని ప్రజాతంత్ర సూత్రాలపై అది ఆధారపడి యుందనిగాని అర్థం కాదు. ఉదాహరణకు : ఆఫ్ఘనిస్థాన్ స్వాతంత్ర్యం కొరకు, ఆ దేశపు అమీర్ సాగిస్తున్న పోరాటం అక్కడి పరిస్థితుల దృష్ట్యా ఒక విప్లవపోరాటం. అతని భావాలు రాచరిక భావాలే కావచ్చు. కాని ఆ పోరాటం సామ్రాజ్యవాదాన్ని బలహీనపరచేది, విచ్ఛిన్నం చేసేది, కూలద్రోసేది. కాబట్టి అది విప్లవ పోరాటమే. కానీ సామ్రాజ్యవాద యుద్ధం జరుగుతున్నప్పుడు "దుస్సాహసులైన" "ప్రజాతంత్రవాదులు", "సోషలిస్టులు", "విప్లవకారులు" "రిపబ్లికన్లు" చేసిన పోరాటం మాత్రం అభివృద్ధి నిరోధక పోరాటం. కెడనస్పీట్సెలిటలీ, రెసిడెల్, పీడ్మన్, ఫెర్నోల్, డాన్, హండర్సన్, క్లైన్సలు సాగించిన పోరాటం ఇలాంటిదే. కారణమేమిటంటే, వారి పోరాటం సామ్రాజ్యవాదపు స్వభావాన్ని మెరుగుపెట్టి బలపరచింది. దానికి విజయం చేకూర్చింది. అలాగే ఈజిప్టు స్వాతంత్ర్యం కొరకు అక్కడి వర్తకులు బూర్జువా మేధావులు సాగిస్తున్న పోరాటం, అక్కడి పరిస్థితుల దృష్ట్యా విప్లవ పోరాటం. ఈజిప్టులో జాతీయోద్యమ నాయకులు బూర్జువావర్గానికి చెందిన వారే; బూర్జువా హోదాలు గలవారు; వారు సోషలిజానికి వ్యతిరేకులనే మాట కూడా నిజమే. అయినప్పటికీ అది విప్లవ పోరాటం. కాని ఈజిప్టును బానిస దేశంగా ఉంచుకోవడానికి బ్రిటీష్ లేబరు ప్రభుత్వం చేస్తున్న పోరాటం మాత్రం, పై కారణాలను బట్టే, అభివృద్ధి నిరోధక పోరాటం. ఆ ప్రభుత్వ నాయకులు శ్రామిక వర్గానికి చెందిన వారే కావచ్చు; సోషలిజాన్ని "కోరే" వారే కావచ్చు. కాని వారు సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించారా? ఇంతకన్న పెద్ద వలసదేశాలలోనూ పరాధీన దేశాల్లోనూ ఉదాహరణకు చైనా దేశాల్లో – జరుగుతున్న జాతీయోద్యమాలను గురించి నేనిప్పుడు ప్రస్తావించవలసిన అవసరం లేదు. ఆ దేశాల్లో స్వాతంత్ర్యం వైపు వేసే ప్రతీ అడుగు, ముక్కుకు సూటిగా చూస్తే ప్రజాతంత్ర కోర్కెలకు వ్యతిరేకమే కావచ్చు. కాని అది సామ్రాజ్యవాదాన్ని బలహీనపరిచే గట్టి సమ్మెట దెబ్బ. అంటే అది నిస్సందేహంగా విప్లవ మార్గంలో అడుగే.

పీడిత దేశాల్లో జాతీయోద్యమాన్ని గురించి మనం అంచనా వేసేటప్పుడు ఆ ఉద్యమంలో ముక్కుకు సూటియైన ప్రజాతంత్రం ఉన్నదా లేదా అని రంధ్రాన్వేషణ చేయకూడదనీ, ఫలితాలను బట్టే అంచనా వేయాలనీ, అనగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం యొక్క ఫలితాల దృష్ట్యా ఆలోచించాలనీ లెనిన్ స్పష్టం చేశాడు. అంటే ఆయా ఉద్యమాలు "దేనికవే కాకుండా ప్రపంచం మొత్తం మీద కలిగే ఫలితాలను ఒక అంచనా వేయాలన్నాడు. ("లెనిన్: మార్క్స్, ఎంగెల్స్–మార్క్సిజం" పేజీ 199) ఈ మాటల్లో ఎంతైనా సత్యం ఉంది.

## 2. పీడిత జాతుల స్వాతంత్ర్యోద్యమమూ, శ్రామిక విప్లవం

జాతుల సమస్యను పరిష్కరించడంలో లెనినిజం ఈ క్రింది సూత్రాల నుంచి బయలు దేరుతుంది : (ఎ) ఈ రోజులలో ప్రపంచమంతటా రెండు శిబిరాలుగా విభజింపబడి వుంది. మొదటిది, ఫైనాన్స్ పెట్టుబడి కలిగి ఉంటూ, ప్రపంచ జనాభాలో అత్యధిక భాగాన్ని కొల్లగొట్టుకునే కొద్దిపాటి నాగరిక జాతులు; రెండవది వలస దేశాలలోనూ, పరాధీన దేశాలలోనూ, దారుణమైన దోపిడీకి గురయ్యే జాతులు, అంటే ప్రపంచంలో అత్యధిక జనాభా ప్రజలు (బి) ఫైనాన్స్ పెట్టుబడి కింద దోచుకోబడే వలస దేశాలు, పరాధీన దేశాలు సామ్రాజ్యవాదానికి పెద్ద రిజర్వులుగా ఉపయోగ పడుతున్నాయి. వాటి నుంచే ప్రధానంగా సామ్రాజ్య వాదానికి బలం లభిస్తోంది.

(సి) వలస, పరాధీన దేశాల ప్రజలు యీ దోపిడీ నుంచి విముక్తి పొందాలంటే సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా విప్లవ పోరాటం సాగించడ మొక్కటే అందుకు మార్గం.

(డి) ప్రపంచంలో అతి ప్రధానమైన వలస, పరాధీన దేశాలు ఇది వరకే ఇట్టి జాతీయ, స్వాతంత్ర్యోద్యమ మార్గాన్ని చేబట్టాయి. ఇది తప్పక ప్రపంచ పెట్టుబడిదారీ విధానపు సంక్షోభానికి దారి తీస్తుంది.

(ఇ) అభివృద్ధి చెందిన దేశాల్లో శ్రామికోద్యమ ప్రయోజనాలు ఫలించాలంటే యీ రెండు విప్లవోద్యమాలు ఒకటిగా కలిసిపోవాలి. సమిష్టి శత్రువైన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్య సంఘటన యేర్పడాలి.

(ఎఫ్) అభివృద్ధి చెందిన దేశాల్లో శ్రామికవర్గం జయించాలి. వలస దేశాల్లో పీడిత ప్రజలు సామ్రాజ్యవాద సంకెళ్ల నుంచి విముక్తి చెందాలంటే విప్లవకరమైన యీ సంయుక్త సంఘటన బలపడి తీరాలి.

(జి) సామ్రాజ్యవాద దేశాల్లో శ్రామికవర్గం "తన దేశపు" సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పీడిత జాతులు సాగించే స్వాతంత్ర్యోద్యమానికి ప్రత్యక్షంగా ధృఢనిశ్చయంతో సహాయం చేయకపోతే, అట్టి విప్లవకరమైన సంయుక్త సంఘటన ఏర్పడ్డం అసాధ్యం. ఎందుచేతనంటే, "ఇతర జాతుల్ని అణచియుంచే ఏ జాతీ స్వతంత్రజాతి కాజాలాదు. (మార్క్స్)

(హెచ్) ఇలా సహాయం చేయడమంటే అర్థం, ప్రతి జాతికి విడిపోయే హక్కు, సొంత ప్రభుత్వ మేర్పరచుకొనే హక్కు, వుండాలనే నినాదాన్ని బలపరచడమన్న మాట; దాన్ని ప్రచారం చేయడ మన్న మాట; దాన్ని అమలు జరపడమన్నమాట.

(ఐ) ఇలా అమలు జరపకపోతే, వివిధ జాతుల ప్రజలు ఒకే ప్రపంచ ఆర్థిక విధానంలో సమైక్యత చెందడం అసంభవమవుతుంది. ఇట్టి ప్రపంచ ఆర్థిక విధానం, సోషలిజం యొక్క విజయానికి భౌతిక పునాది.

(జె) ఈ సమైక్యత ఐచ్ఛికమైనదిగా వుండాలి. వివిధ జాతుల మధ్య పరస్పర విశ్వాసం, సోదరత్వమే దానికి పునాది.

కనుకనే, జాతుల సమస్య రెండు విధాలైన సమస్య, రెండు ధోరణులతో కూడిన సమస్య. మొదటిది సామ్రాజ్యవాద సంకెళ్ళ

నుంచి రాజకీయ స్వాతంత్ర్యం పొంది, స్వతంత్ర జాతీయ ప్రభుత్వం యేర్పచుకోవడం. ఇది సామ్రాజ్యవాద దోపిడీ వల్ల, వలస దేశాలను అణచి యుంచే విధానంవల్ల యేర్పడ్డ ధోరణి. రెండవది, వివిధ జాతుల మధ్య ఆర్థిక సమైక్యత. ఇది ఒకే ప్రపంచ మార్కెటు వల్ల, ఒకే ప్రపంచ ఆర్థిక విధానం వల్ల ఏర్పడ్డ లక్షణం.

ఈ సందర్భంలో లెనిన్ క్రింది విధంగా వ్రాశాడు : పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతూన్నప్పుడు, జాతుల సమస్యకు రెండు చారిత్రక లక్షణాలేర్పడతాయి. మొదటిది, జాతీయ జీవనం వికసించడం, జాతీయోద్యమాలు ఉద్భ వించడం, ఒక జాతి మరో జాతిని అణచియుంచే పద్ధతికి వ్యతిరేకంగా పోరాడ్డం, జాతీయ ప్రభుత్వా లేర్పడ్డం రెండవది, వివిధ జాతుల మధ్య అన్ని విధాలైన సంబంధాలు అంతకంతకు పెరగటం, ఒక జాతికీ,– మరో జాతికీ మధ్య వున్న అడ్డుగోడలు పడిపోవడం, ప్రపంచంలో అన్ని దేశాలు పెట్టుబడి, ఆర్థిక జీవనం, రాజకీయాలు, సైన్సు, మొదలైనవన్నీ సమైక్యత చెందడం. ఈ రెండు లక్షణాలూ ప్రపంచ పెట్టుబడిదారీ విధానం యొక్క విశ్వవ్యాపిత సూత్రానికి సంబంధించినవే. మొదటిది పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందే ప్రారంభ దశలో ప్రాధాన్యత వహిస్తుంది. రెండవది పెట్టుబడిదారీ విధానం పరిపక్వ దశకు వచ్చినప్పుడు సోషలిస్టు సమాజంలోకి పరివర్తన చెందేటప్పుడు ప్రాధాన్యత వహిస్తుంది" (లెనిన్ కలెక్టెడ్ వర్క్స్, రష్యన్ కూర్పు, 17వ సంపుటి పేజీ 139–140)

సామ్రాజ్యవాదుల దృష్టితో చూడనట్లయితే, ఇవి రెండూ సమన్వయపరచే వీలులేని వైరుధ్యాలు. ఎందుచేతనంటే, సామ్రాజ్యవాదం వలస దేశాలను కొల్లగొట్టకోకుండా ఉండలేదు. వాటినది బలవంతంగా "ఏక ఖండంలో" చేర్చుకొంటుంది. సామ్రాజ్యవాదం యితర ప్రాంతాలను కలుపుకోవడం ద్వారానే, వలస దేశాలను జయించడం ద్వారానే, వివిధ జాతుల్ని దగ్గరకు తీసుకురాగలుగుతుంది.

కాని, కమ్యూనిస్టుల దృష్టిలో ఇవి రెండూ పరస్పర వైరుధ్యాలు కావు; ఒకే లక్ష్యం యొక్క రెండు రూపాలు. ఈ లక్ష్యం, పీడిత ప్రజల్ని సామ్రాజ్యవాద సంకెళ్ళనుంచి విముక్తి చేయడం. ఈ రెండింటి మధ్య వైరుధ్యమెందుకు లేదంటే, వివిధ జాతుల మధ్య పరస్పర విశ్వాసం, ఐచ్ఛికమైన ఒప్పందం ఉన్నప్పుడు ఆ జాతులన్నీ ఒక ప్రపంచ ఆర్థిక విధానంలో సమైక్యత చెందగలవు. ఇట్టి ఐచ్ఛిక సమైక్యతకు మార్గం వలస దేశాలన్నీ సామ్రాజ్య వాదుల "ఏకఖండం" నుంచి విడిచిపోవడమేననీ, వలస దేశాలు స్వతంత్ర్యరాజ్యాలుగా అభివృద్ధి చెందడమేననీ కమ్యూనిజం గుర్తిస్తుంది.

కనుకనే, పాలక జాతులకు చెందిన (బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా, ఇటలీ, జపాన్ మొదలైనవి) "సోషలిస్టులు" ప్రచారం చేసే సామ్రాజ్యవాద దురహంకారాన్ని తీవ్రంగాను, ఎడతెగకుండాను, దృఢ నిశ్చయంతోను, ఎదుర్కొనవలసి ఉంటుంది. వీరు తమ సామ్రాజ్యవాద ప్రభుత్వాలతో పోరాడ్డానికిష్టపడరు. "తమ" వలస దేశాల్లోని పీడిత ప్రజలు స్వాతంత్ర్యం కొరకు, విడిపోయే హక్కు కొరకు జరిపే పోరాటాన్ని బలపరచరు.

ఈ బూటకపు సోషలిస్టుల ప్రచారాన్ని ఎదుర్కోకపోతే, పాలక దేశాలకు చెందిన కార్మికవర్గం నిజమైన అంతర్జాతీయ తత్వం అలవర్చుకోవడం అసంభవం. వలస, పరాధీన దేశాల కష్టజీవులతో స్నేహసంబంధాలేర్పరచుకొనే విధంగా అవి శిక్షణ పొందడం అసాధ్యం. శ్రామిక విప్లవానికి నిజమైన సన్నాహాలు చేయటంలో తర్ఫీదు పొందడం అసాధ్యం. రష్యన్ శ్రామికవర్గం పూర్వపు రష్యన్ సామ్రాజ్యంలోని పీడిత జాతుల సానుభూతి సహకారాలను పొందియుండకపోతే విప్లవం జయించి యుండేది కాదు; కోల్చాక్, డెనికిల తిరుగుబాట్లు అణచిబడియుండేవి కావు. రష్యన్ శ్రామికవర్గం యీ సహాయ సానుభూతులను సంపాదించడానికి మొట్టమొదట రష్యన్ సామ్రాజ్యవాద సంకెళ్ళను విముక్తి చేయవలసి వచ్చింది; ఇది చేసి యుండకపోతే సోవియట్ ప్రభుత్వాన్ని దృఢతరం చేయడం అసాధ్యమై యుండేది. శ్రామికవర్గానికి నిజమైన అంతర్జాతీయ తత్వమలవడి ఉండేది కాదు. వివిధ జాతుల ప్రజలు ఐచ్ఛికంగా సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల యూనియన్‌లో చేరడానికి అవకాశముండేది కాదు. ముందు ముందు ప్రపంచంలోని జాతులన్నీ ఒకే ప్రపంచ ఆర్థిక విధానంలో సమైక్యత చెందడమెలాగో మార్గం చూపేవి యీ సోవియటు సోషలిస్టు రిపబ్లిక్కుల యూనియన్.

కనుకనే, పీడిత దేశాల్లోని సోషలిస్టుల జాతీయ సంకుచితతత్వాన్ని, ఒంటెత్తు ధోరణిని ఎదుర్కోవలసిన అవసరం ఎంతో ఉంది. వీరు తమ జాతీయ పరిమితులను దాటి ఆలోచించరు. తమ తమ దేశాల్లోని స్వాతంత్ర్యోద్యమానికి, పాలక దేశాల్లోని శ్రామికోద్యమానికి గల సంబంధాన్ని వీరు అర్థం చేసుకోరు.

ఇట్టి పోరాటం జరపనిదే, పీడిత దేశాల్లో శ్రామికవర్గం స్వతంత్ర విధానమవలంబించటం అసాధ్యమవుతుంది. ఉమ్మడి శత్రువుతో జరిపే పోరాటంలో సామ్రాజ్యవాదాన్ని కూలద్రోసేటందుకు చేసే పోరాటంలో పాలక దేశాల మధ్య శ్రామిక వర్గంలో చేతులు కలపడం అసాధ్యమవుతుంది. అంతర్జాతీయ సమైక్యత దురూహ్యమవుతుంది.

పాలక దేశాల కష్టజీవులు, పీడిత దేశాల ప్రజాసామాన్యం విప్లవోపేతమైన అంతర్జాతీయతత్వ మలవర్చుకోవలసిన విధానమిదే.

కార్మికుల్లో అంతర్జాతీయ తత్వమలవర్చడానికి కమ్యూనిస్టులు నెరవేర్చవలసిన యీ రెండు విధాలైన కర్తవ్యాన్ని లెనిన్ క్రింది విధంగా విపులీకరించాడు :

"... ఇలాంటి శిక్షణ పెద్ద పెద్ద దేశాల్లోను, చిన్న చిన్న పీడిత దేశాల్లోను కూడా ఒకే విధంగా ఉంటుందా? దురాక్రమణ దేశాల్లోనూ, పరాధీన దేశాల్లోనూ కూడా ఒకే విధంగా ఉంటుందా?

"ఎన్నటికీ ఒకే విధంగా ఉండదు. ఒకే గమ్యస్థానం చేరుకోవడానికి అనగా వివిధ జాతుల మధ్య సంపూర్ణ సమానత్వం నెలకొల్పడానికీ, సన్నిహిత సంబంధమేర్పరచడానికీ, ఆ తర్వాత అన్ని జాతుల్నీ సమైక్యపరచడానికి మార్గాలు చాలా ఉన్నాయి. ఆయా పరిస్థితులను బట్టి అవి ఉంటాయి. ఉదాహరణకు ఒక పేజీ మధ్యనున్న చుక్కను చేరుకోవాలంటే రెండుమార్గాలుంటాయి.

ఎడమవైపు నుంచి అయితే కుడివైపుగానూ, కుడివైపు నుంచి అయితే ఎడమవైపుగానూ రావలసి యుంటుంది. అలాగే, పీడించే ఒక జాతికి చెందిన సోషల్ డెమోక్రాట్స్ సూత్రప్రాయంగా అన్ని జాతులూ కలిసి పోవాలని ఒకవైపు వాదిస్తూ మరొక వైపు "తన రెండవ నికొలస్ (జారు చక్రవర్తి) "తన" విల్‌హెల్మ్ "తన" పాయిన్ కేర్ కూడా చిన్న జాతులూ, పెద్ద జాతులూ కలిసిపోవాలంటున్నారనే విషయాన్ని (ఇతర దేశాలను కలుపుకుపోవడం ద్వారా) గుర్తించక పోయినట్లయితే – అనగా రెండవ నికోలస్ గెలిషియాలోను, రెండవ విల్‌హెల్మ్ బెల్జియంతోనూ, ఇలాగే ఇతర పాలకవర్గాల యితర దేశాలతోనూ కలిసి పోవాలంటున్నారనే విషయాన్ని ఒక్క నిమిషం మరచిపోయినప్పటికీ, అలాంటి సోషలిస్టు డెమోక్రాటు సిద్ధాంత రీత్యా వితండవాది; ఆచరణరీత్యా సామ్రాజ్యవాద ప్రోత్సాహకుడు.

"పీడించే దేశాల్లో శ్రామికవర్గం అంతర్జాతీయ తత్వమలవరచుకోవాలంటే పీడింపబడు దేశాలకు విడిపోయే స్వేచ్ఛ ఉండాలనే డిమాండుకు ప్రాధాన్యత యివ్వాలి. ఇలా చేయకపోతే అంతర్జాతీయతత్వమలవడదు. పీడించే దేశాల్లో సోషల్ డెమోక్రాట్ ఇట్టి ప్రచారం చేయకపోయి నట్లయితే, అట్టి వారిని సామ్రాజ్యవాది అనీ, పరమనీచుడనీ పిలవడానికి మనకు హక్కు వుంది. అలా పిలవడం మన విధి కూడా. సోషలిజం రాక ముందు విడిపోయే అవకాశాలు వెయ్యికి ఒకటే వుండవచ్చు. విడిపోవడం అంతగా ఆచరణీయం కాకపోవచ్చు. అయినప్పటికీ, మన మీ ప్రధాన హక్కును మాత్రం బలపరచి తీరాలి.

"మరోవైపు, పీడిత జాతికి చెందిన సోషల్ డెమోక్రాట్ తన ఆందోళనలో రెండవ అంశానికి అనగా వివిధ జాతులు "ఇచ్ఛికంగా సమైకత చెందా"లనే అంశానికి ప్రాధాన్యత యివ్వవలసి యుంటుంది. అతడు అంతర్జాతీయవాదిగా తన విధులను నిర్వర్తిస్తూనే, తన జాతి యొక్క రాజకీయ స్వాతంత్ర్యానికై పాటుపడవచ్చు; లేదా తన పొరుగున వున్న మరో ప్రభుత్వంలో చేరవచ్చు. అయితే ప్రతి సందర్భంలో మాత్రం అతడు జాతీయ సంకుచితత్వానికి, ఒంటెత్తు ధోరణికి వ్యతిరేకంగా పోరాడ్డమవసరం. ఐక్యత కోసం "ఏక ఖండం" కోసం పాటు పడవలసిన అవసరం తన ఒక్క జాతి పొందవలసిన ప్రయోజనం కంటే అన్ని జాతులూ పొందవలసిన ప్రయోజనాలకెక్కువ ప్రాధాన్యత ఇవ్వడమవసరం.

"కొందరు యీ సమస్యను సమగ్రంగా పరిశీలించక పీడించే దేశాల్లోని డెమోక్రాట్ల వైఖరికి, పీడిత దేశాల్లోని వారి వైఖరికి 'వైరుధ్యం' ఉన్నట్లు భావిస్తారు. విడిపోవడానికి స్వేచ్ఛ ఉండాలంటూ సామ్రాజ్యవాద దేశాల్లో సోషల్ డెమోక్రాట్లు చేసే ఆందోళనకూ, కలిసి ఉండడం మంచిదని పీడిత దేశాల వారు చేసే ఆందోళనకూ వైరుధ్యం లేదా – అని వారంటారు. కానీ, కొంచెం లోతుగా ఆలోచిస్తే అట్టి వైరుధ్యం లేదని, ఉండడానికి అవకాశమే లేదని స్పష్టమవుతుంది. ఒకానొక పరిస్థితి నుంచి అంతర్జాతీయతత్వానికి సమస్త జాతుల సమైక్యతను పురోగమించాలంటే ఆ గమ్యస్థానం చేరుకోవాలంటే మరొక మార్గమేదీ లేదని, ఉండడానికి అవకాశం లేదని మనం తెలుసుకోగలం." (లెనిన్ : కలెక్టెడ్ వర్క్స్, రష్యన్ కూర్పు, 19వ సంపుటి, పేజీ 261)

ooooo